నమస్తే తెలంగాణ

# మెదక్

III హైదరాబాద్, శుక్రవారం 25 ఏప్రిల్ 2025 MEDAK




పిల్లర్ల దశలోనే అర్థాంతరంగా నిలిచిపోయిన మోర్గి హైలెవల్ బ్రిడ్జి పనులు

## మోర్గి వంతెనకు మోక్షమెప్పుడో

- ముందుకు సాగని పనులు
- ఏటా వర్షాకాలంలో రాకపోకలకు తిప్పలు

నాగల్‌గిద్ద, ఏప్రిల్ 24: సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలంలోని మోర్గి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం లభించడం లేదు. 2022లో రూ.6.32 కోట్లతో అప్పటి ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కరస్‌గుత్తి పీడబ్ల్యూడీ నుంచి కర్ణాటక సరిహద్దు వరకు డబుల్‌లైన్ రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో దానిని ప్రారంభించారు. ఈ రోడ్డుపై మోర్గి వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు టెండర్లు పిలిచి పనులు కాంట్రాక్టర్‌కు అప్పగించారు. కారణం ఏందో తెలియదు కాని పనులు పిల్లర్ల దశలోని అర్థాంతరంగా నిలిచిపోయాయి. కరస్‌గుత్తి పీడబ్ల్యూడీ నుంచి కర్ణాటక బార్డర్ వరకు గల రోడ్డుపై నిత్యం బీదర్-నారాయణఖేడ్‌కు వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. దీంతోపాటు మోర్గి మోడల్ పాఠశాల ఇక్కడ ఉండడంతో విద్యార్థులు బస్సుల్లో, ప్రైవేట్ వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. బ్రిడ్జి లేక వర్షాకాలంలో రాకపోకలతో విద్యార్థులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు స్పందించి వర్షాకాలం నాటికి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేయించి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

## మళ్లీ కేసీఆర్‌దే అధికారం

- జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు



జహీరాబాద్, ఏప్రిల్ 24: మోసపూరిత పాలన సాగిస్తున్న కాంగ్రెస్‌పై ప్రజలు విరక్తి చెందారని, మళ్లీ అధికారంలోకి కేసీఆర్ రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని, బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం తథ్యమని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. గురువారం 'నమస్తే తెలంగాణ'తో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు, అనేక హామీలిచ్చి ఒక్కటి అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. కేసీఆర్ పాలనలో ప్రజలంతా సుభిక్షంగా ఉన్నారని, కాంగ్రెస్ పాలనలో మళ్లీ పదేండ్లు వెనక్కి పోయామని ప్రజలు అవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష అని, ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులతో పాటు నాయకులు, అభిమానులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జహీరాబాద్ నియోజకవర్గం నుంచి 4వేల మంది వెళ్లేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. 30 బస్సులు, 100 జీపులు, 100 ఇతర వాహనాల్లో పార్టీ శ్రేణు లు తరలివెళ్తారని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు తెలిపారు.

## అన్నివర్గాలను మోసం చేసిన కాంగ్రెస్



చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

- రజతోత్సవ సభను విజయవంతం చేయండి
- మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 24 : ఈనెల 27న వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం చిన్నశంకరంపేటలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. వరంగల్ సభకు అంచనాలకు మించి ప్రజలు తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సొంత ఖర్చులతో వాహనాలను ఏర్పాటు చేసుకొని సభకు వచ్చేందుకు ఉత్సాహం చూపుతున్నారని, మరికొంతమంది పాదయాత్రగా వరంగల్ సభకు తరలివెళ్తున్నట్లు చెప్పారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాలను మోసం చేసిందన్నారు. మహిళలకు ప్రతినెలా రూ. 2500 ఇస్తామని మోసం చేసిందన్నారు. రూ. 4000 ఆసరా పింఛన్ ఏమైందని ఆమె ప్రశ్నించారు. రైతులకు రెండు లక్షల పంట రుణమాఫీ అసంపూర్తిగా చేసిందని విమర్శించారు. తిరిగి బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు, జిల్లా నాయకుడు లక్ష్మారెడ్డి, చైర్మన్ అంజిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు కుమార్‌గౌడ్, లక్ష్మణ్, పోచయ్య, నాయకులు శ్రీను, సుధాకర్, లాలునాయక్, రమేశ్, హేమచంద్రన్, నాగరాజు, నరేశ్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అకాల వర్షం.. తడిసిన ధాన్యం



మహమ్మద్‌నగర్‌లో తడిసి ముద్దయిన ధాన్యం

కౌడిపల్లి, ఏప్రిల్ 24: మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. కౌడిపల్లి, ధర్మసాగర్, మహమ్మద్ నగర్, నాగ్‌సాన్‌పల్లితో పాటు పలు గ్రామాల్లో వర్షానికి ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. కొన్నిచోట్ల వర్షం ధాటికి ధాన్యం కొట్టుకుపోయింది. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు కాకపోగా రోజుల కొద్ది సెంటర్ల వద్ద రైతులు ధాన్యంతో పడిగాపులు కాస్తున్నారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి వేగంగా ధాన్యం కొనుగోళ్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

## కేసీఆర్ అభిమాని పాదయాత్ర

చేర్యాల, ఏప్రిల్ 24 : చేర్యాల పట్టణానికి చెందిన మనోహర్ అనే బీఆర్‌ఎస్ అభిమాని రజతోత్సవ సభకు హాజరయ్యేందుకు ప్రత్యేక వేషధారణతో గురువారం చేర్యాల నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ అంటే తనకు ఎంతో అభిమానం అని, ఆ అభిమానంతోనే రజతోత్సవ సభకు పాదయాత్రగా వెళ్లాలని ప్రారంభించానని, సకాలంలో రజతోత్సవ సభకు చేరుకుంటానని తెలిపారు. మనోహర్‌కు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, పుర్మ వెంకట్‌రెడ్డి, తాడెం రంజితాకృష్ణమూర్తి, బూరగోని తిరుపతిగౌడ్ అభినందనలు తెలిపారు.



చేర్యాల నుంచి పాదయాత్ర చేస్తున్న మనోహర్

# పులకిస్తున్న పురిటిగడ్డ

### తెలంగాణ ఉద్యమానికి, బీఆర్‌ఎస్‌కు దన్నుగా నిలిచిన గడ్డ ఉమ్మడి మెదక్ జిల్లా



- పోరాటంలో ముందున్న సిద్దిపేట
- నాటి స్మృతులు గుర్తుచేసుకుంటున్న శ్రేణులు
- రజతోత్సవ సభకు సర్వం సిద్ధం
- భారీగా వెళ్లనున్న గులాబీ శ్రేణులు

సిద్దిపేట, ఏప్రిల్ 24( నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్‌ఎస్ పార్టీ 25 వసంతాలు పూర్తిచేసుకుని రజతోత్సవానికి సిద్ధం కావడంతో పురిటి గడ్డ ఉమ్మడి మెదక్ జిల్లా మురిసిపోతున్నది. తెలంగాణ ఉద్యమానికి, బీఆర్‌ఎస్ పార్టీకి ఆది నుంచి జిల్లా ప్రజలు అండగా నిలిచారు. ఉద్యమ నేత, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఏ కార్యం తలపెట్టినా, ఏ పిలుపు ఇచ్చినా జిల్లా ప్రజలు పాల్గొని మద్దతుగా నిలిచారు. 2001 ఏప్రిల్ 14న సిద్దిపేటలో జరిగిన అంబేద్కర్ జయంతి సభలో పాల్గొన్న కేసీఆర్ తెలంగాణ కోసం పోరాటం తప్పదని ప్రకటించారు. 2001 ఏప్రిల్ 27న బీఆర్‌ఎస్‌ను స్థాపించిన తర్వాత ఉద్యమ పార్టీకి జిల్లా అండగా నిలిచింది. 2001లో పార్టీ ఆవిర్భవించిన తొలినాళ్లలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌పై అవాకులు, చెవాకులు పేలారు. మూడొద్దులకే పార్టీ మూసుకుపోతుందని ఎన్నో రకాలుగా హేళన చేసే మాటలు మాట్లాడారు. అయినా ఎక్కడా కేసీఆర్ వెనుకడుగు వేయకుండా ఉద్యమ పార్టీని ముందుకు తీసుకెళ్లి కృతకృత్యులయ్యారు. ఈ క్రమంలో ఆయనకు మెతుకుసీమ గడ్డ అండగా నిలిచింది. 2005లో వరంగల్‌లో నిర్వహించిన జైత్రయాత్ర సభకు కేసీఆర్ సైకిల్‌పై బయలుదేరి వెళ్లారు.సిద్దిపేట నుంచి వరంగల్ బహిరంగ సభ వరకు ఆయన వెంట సైకిళ్లపై వందలాది మంది కార్యకర్తలు, నాయకులు జిల్లా నుంచి తరలివెళ్లారు. 2006లో తెలంగాణ విషయంలో కాంగ్రెస్ పార్టీ మాట తప్పడంతో ఆ పార్టీపై కేసీఆర్ యుద్ధం ప్రకటించారు. సిద్దిపేటలో శంఖారావం పేరిట బహిరంగ సభ నిర్వహించగా, అది సక్సెస్ అయ్యింది. వివిధ ప్రాంతాల నుంచి లక్షల్లో ప్రజలు హాజరై సభకు పెద్ద ఎత్తున మద్దతు ప్రకటించారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం, అప్పటి మంత్రి ఎమ్మెస్సార్ చేసిన వ్యాఖ్యలకు సవాలుగా కేసీఆర్ కరీంనగర్ ఎంపీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు సభలో ప్రకటించారు. అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో కరీంనగర్ నుంచి కనీవినీ ఎరుగని రీతిలో భారీ మెజార్టీతో కేసీఆర్ గెలుపొందారు.

**'తెలంగాణ వాలె జాగో.. ఆంధ్రావాలె బాగో'.. పిలుపు..**

తెలంగాణ కోసం మహాధర్నా పేరిట రాజీవ్ రహదారిని దిగ్బంధం చేశారు. సిద్దిపేట శివారులోని రాజీవ్ రహదారిపై జరిగిన కార్యక్రమానికి కేసీఆర్ హాజరయ్యారు. ఆ కార్యక్రమానికి జిల్లా ప్రజలు, పార్టీ శ్రేణులు, ఉద్యమకారులు హాజరై మద్దతుగా నిలిచారు. 2008లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించిన తర్వాత కాంగ్రెస్ నాయకులకు సవాల్ చేస్తూ సిద్దిపేటలో హరీశ్‌రావు నాయకత్వంలో నిర్వహించిన ఉద్యోగ గర్జనకు భారీ స్పందన లభించింది. 2009 నవంబర్‌లో సిద్దిపేటలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న కేసీఆర్ 'తెలంగాణ వాలె జాగో.. ఆంధ్రా వాలె బాగో..' నినాదమిచ్చారు. ఆ తర్వాత నవంబర్ 9 పాపన్నపేట మండలంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములపై పద్మాదేవేందర్‌రెడ్డి, దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి ఆందోళనకు దిగారు. హరీశ్‌రావు, కేటీఆర్, ఇతర నేతలు పాల్గొని ఆందోళనను ఉధృతం చేశారు. హైదరాబాద్ ఫ్రీజోన్ అంటూ సుప్రీంకోర్టు తీర్పునివ్వడంతో తెలంగాణ ఉద్యమం ఊపందుకుంది. ఫ్రీజోన్ రద్దుకు, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌తో కేసీఆర్ ఆమరణ దీక్షకు నిర్ణయించారు. ఆ తర్వాత చేపట్టిన అన్ని ఆందోళన కార్యక్రమాలకు మెతుకుసీమ కేసీఆర్‌కు అండగా నిలిచింది.





**అనేక పోరాటాలు..**

సిద్దిపేట రంగధాంపల్లి వేదికగా కేసీఆర్ ఆమరణ దీక్షకు దిగుతానని ప్రకటించడంతో మరోసారి సిద్దిపేట జిల్లా వార్తల్లోకెక్కింది. ఆమరణ దీక్ష బయలుదేరిన కేసీఆర్‌ను నవంబర్ 29న కరీంనగర్ శివారులో పోలీసులు అరెస్టు చేసి ఖమ్మం తరలించగా సిద్దిపేట దీక్షా స్థలి వద్ద హరీశ్‌రావు, పద్మాదేవేందర్‌రెడ్డి, దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి తదితర నాయకులు దీక్షకు సిద్ధమవడంతో పోలీసులు భారీ సంఖ్య లో మోహరించి ఆ దీక్షా స్థలిని అణచివేశారు. ఉద్యమం మరింత ఉధృతమైంది. ఒక వైపు కేసీఆర్‌ను అరెస్టు చేసి ఖమ్మం జైలుకు తరలించడంతో పాటు ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు ఉద్యమం బాట పట్టడంతో జిల్లా విద్యార్థి లోకం లేచింది. జిల్లా విద్యార్థి విభాగం నాయకులు చైతన్య పరిచేందుకు విస్తృతంగా విద్యార్థి గర్జన పేరిట సదస్సులు జరిగాయి. ఉమ్మడి జిల్లాలో ఉద్యమంలో భాగంగా జాతీయ రహదారిపై భారీ ధర్నా నిర్వహించారు. రైలురోకోలు, తెలంగాణ కోసం రోడ్లపై వంటావార్పు, రోడ్ల దిగ్బంధం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ ఉద్యమాన్ని రోజురోజుకు ఉధృతపరుస్తూ తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా ముందుకెళ్లిన ఉద్యమ బీఆర్‌ఎస్ పార్టీ ప్రజా సమస్యలపై కూడా పోరాటం చేసింది. ప్రతి పౌరుడు ఉద్యమంలో భాగస్వాములను చేసింది. 42 రోజుల పాటు జరిగిన సకల జనుల సమ్మెలో బీఆర్‌ఎస్ కీలక పాత్ర పోషించింది. హరీశ్‌రావు నేతృత్వంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో 132 కిలో మీటర్ల పాదయాత్ర నిర్వహించారు. కాగా, ఎల్కతుర్తిలో ఈనెల 27న పార్టీ రజతోత్సవ సభను నిర్వహిస్తుండగా.. ఈ సభకు సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల నుంచి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు, జనం వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆ రోజు ప్రతి గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించి రజతోత్సవ సభకు తరలివెళ్లనున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో పార్టీ జెండాలను సిద్ధం చేశారు. రంగులు అద్దారు. వాల్ రైటింగ్, పోస్టర్లు పెద్దఎత్తున వేశారు. సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. నేడు సిద్దిపేట నియోజకవర్గం నుంచి రెండు వేల మంది యువకులు పాదయాత్రగా సభకు బయలుదేరుతారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఎప్పటి కప్పుడు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు, పార్టీ బాధ్యులకు దిశానిర్దేశం చేశారు. రెండు లక్షలకు పైగా జనం కదిలేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

## నాడు పచ్చదనం.. నేడు కళావిహీనం

- బచ్చుగూడం బృహత్ పల్లె ప్రకృతి వనంలో ఎండిపోతున్న చెట్లు
- దెబ్బతింటున్న పర్యావరణ పరిరక్షణ లక్ష్యం



బచ్చుగూడ బృహత్ పల్లె ప్రకృతి వనంలో పర్యవేక్షణ లేక ఎండిపోతున్న చెట్లు

పటాన్‌చెరు, ఏప్రిల్ 24: పటాన్‌చెరు మండలంలోని బచ్చుగూడ గ్రామ పంచాయతీ పరిధిలో బీఆర్‌ఎస్ హయాంలో ఏర్పాటు చేసిన బృహత్ పల్లెప్రకృతి వనం కళావిహీనంగా మారింది. బీఆర్‌ఎస్ హయాంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బృహత్ పల్లెప్రకృతి వనానికి శంకుస్థాపన చేసి, మొక్కలు నాటించారు. నిత్యం మొక్కలకు నీరుపోసి సంరక్షించారు. దీంతో మొక్కలు పెరిగి పరిసరాలు ఆహ్లాదంగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మొక్కలకు నీరు పోయకపోవడంతో పాటు సంరక్షణ చర్యలు తీసుకోవడం లేదు. దీంతో నాటిన మొక్కలు ఎండిపోయి నర్సరీ ఎడారిని తలపిస్తున్నది. రూ. లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన నర్సరీకి గేట్ ఉన్నా పర్యవేక్షణ లేక మేకలు, పశువులు వచ్చి మొక్కలను ధ్వంసం చేస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ, ప్రజలకు స్వచ్ఛమైన గాలిని, ఆహ్లాదాన్ని అందించడం, కోతులు గ్రామాల వైపు రాకుండా ఉండేందుకు నాటి సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ పల్లెప్రకృతి వనాలు ఏర్పాటు చేయించారు. ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసి, ప్రతి ఇంటికీ మొక్కలు పంపిణీ చేయడంతో పాటు గ్రామంలో రోడ్లకు ఇరువైపులా, ఖాళీ స్థలాల్లో నీడనిచ్చే, పండ్లు ఇచ్చే మొక్కలు నాటించారు. నాటిన మొక్కలను కాపాడేందుకు ప్రత్యేకంగా కూలీలను ఏర్పాటు చేశారు. మొక్కలకు నీరు పోసేందుకు గ్రామ పంచాయతీలకు ట్రాక్టరు, ట్యాంకర్లు అందించారు. దీంతో పల్లెప్రకృతి వనాల్లో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పండ్లు సైతం కాశాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నర్సరీల నిర్వహణ, హరితహారం మొక్కల సంరక్షణను గాలికి వదిలేశారు. దీంతో ప్రస్తుతం పల్లెప్రకృతి వనాలు ఎండిపోయి అధ్వానంగా కనిపిస్తున్నాయి. హరితహారం మొక్కలు ఎండిపోయాయి. చాలాచోట్ల చెట్లు నరికివేతలకు గురవుతున్నాయి. దీంతో పర్యావరణ పరిరక్షణ అనే లక్ష్యం దెబ్బతింటున్నది.

## ప్రభుత్వ భూములు కబ్జాచేస్తే చర్యలు

- త్వరలో గౌరవెల్లి ప్రాజెక్టు కాలువ పనులు ప్రారంభం
- మంత్రి పొన్నం ప్రభాకర్



పోతారం(ఎస్)లో అవగాహన సదస్సులోనే మంత్రికి భూ సమస్యలు విన్నవిస్తున్న రైతులు

హుస్నాబాద్‌రూరల్/ అక్కన్నపేట, ఏప్రిల్ 24: భూసమస్యల శాశ్వత పరిష్కారానికే సర్కార్ కొత్త భూభారతి ఆర్‌వోఆర్ చట్టాన్ని తీసుకువచ్చిందని రాష్ట్ర బీసీ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్), అక్కన్నపేట మండల కేంద్రంలో జరిగిన భూ భారతి చట్టం అవగాహన సదస్సుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. భూభారతి చట్టం పారదర్శకంగా అమలవుతుందని తెలిపారు. ప్రభుత్వ భూములను కబ్జాలు చేసిన వారిపై పార్టీలకతీతంగా చర్యలు ఉంటాయని తెలిపారు. భూభారతి చట్టంలో భాగంగా గ్రామ రెవెన్యూ అధికారులను, లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించనున్నట్లు చెప్పారు. భూరికార్డుల నిర్వహణను పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు కాలువ పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రాజెక్టు పూర్తి చేసి ఈ వానకాలంలో నీళ్లందిస్తామని చెప్పారు. ఇందుకోసం భూ నిర్వాసితులు సహకరించాలని కోరారు. వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు అదనపు కలెక్టర్ హమీద్ భూభారతి చట్టంపై పవర్ ప్రజంటేషన్ ఇచ్చారు. అవగాహన సదస్సు ముగిసిన వెంటనే పలువురు రైతులు పలు భూసమస్యలను మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, ఆర్డీవో రామ్మూర్తి, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆర్టీఐ సభ్యుడు సూర్యవర్మ, ఏఎంసీ చైర్మన్ తిరుపతిరెడ్డి, ముత్యాల సంజీవరెడ్డి, బంక చందు, జంగపల్లి అయిలయ్య, రైతులు పాల్గొన్నారు.

## ఓరుగల్లుకు గులాబీ దండు

### సంగారెడ్డి నుంచి భారీగా తరలివెళ్లనున్న బీఆర్‌ఎస్ శ్రేణులు.. రజతోత్సవ సభపై వినూత్న రీతిలో ప్రచారం

- వాడవాడలా వాల్‌పోస్టర్లు, వాల్‌రైటింగ్, బ్యానర్లు ఏర్పాటు
- జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు విస్తృతంగా పార్టీ సమావేశాలు
- వరంగల్ సభకు వెళ్లేందుకు నేతలు, కార్యకర్తలు, అభిమానులు సిద్ధం





సంగారెడ్డిలో వాల్‌రైటింగ్ రాస్తున్న జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉద్యమ రథసారధి కేసీఆర్ ఒక్క పిలుపునిస్తే ఆయన వెన్నంటే దండులా కదలటం సంగారెడ్డి జిల్లా జనం నైజం. మలిదశ తెలంగాణ ఉద్యమంలో సంగారెడ్డి జిల్లా ప్రజలు కేసీఆర్ వెన్నంటే నడిచారు. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం కేసీఆర్ సారథ్యంలో జరిగిన ప్రతి పోరాటంలో జిల్లా ప్రజలు పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులతో పాటు అన్నివర్గాలు తెలంగాణ ఉద్యమంలో చివరి వరకూ పోరాడారు. తెలంగాణ సిద్ధించిన అనంతరం వచ్చిన ప్రతి ఎన్నికల్లోనూ జిల్లా ప్రజలు బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టి అధినేతపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. కేసీఆర్ సారథ్యంలో బీఆర్‌ఎస్ ఆవిర్భవించి 25 ఏండ్లు పూర్తిచేసుకున్న సందర్భాన్ని ప్రజలు ప్రస్తుతం గుర్తు చేసుకుంటున్నారు. ఈనెల 27న వరంగల్ జిల్లాలో జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు దండులా కదిలేందుకు జిల్లా ప్రజలు, రైతులు, యువకులు, విద్యార్థులు, బీఆర్‌ఎస్ శ్రేణులు సిద్ధమవుతున్నారు. జిల్లా అంతటా బీఆర్‌ఎస్ రజతోత్సవ సందడి కనిపిస్తున్నది.

**నేతలకు హరీశ్‌రావు దిశానిర్దేశం..**

నాటి ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట గడ్డ నుంచి తెలంగాణ ఉద్యమానికి కేసీఆర్ సమరశంఖం పూరించారు. 27 ఏప్రిల్, 2001న కేసీఆర్ సారథ్యంలో బీఆర్‌ఎస్ పురుడుపోసుకుంది. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణను సాధించడమే కాకుండా వచ్చిన తెలంగాణ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి దేశానికి తలమానికంగా తీర్చిదిద్దారు. తెలంగాణ ప్రజల స్వప్నం సాకారం చేసిన బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏండ్లు పూర్తి కానున్న సందర్భంగా ఈనెల 27న వరంగల్ జిల్లాలో పెద్దఎత్తున రజతోత్సవ సభను నిర్వహించనున్నారు.ఈ సభకు సంగారెడ్డి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు వరంగల్ సభను విజయవంతం చేయడంలో నిమగ్నమయ్యారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, పటాన్‌చెరు కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి తదితరులతో సమావేశమై వరంగల్ సభకు సన్నద్ధంపై దిశానిర్దేశం చేశారు. ఇటీవల సంగారెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో నిర్వహించిన పార్టీ సమావేశాల్లోనూ వరంగల్ సభ ఏర్పాట్లపై చర్చించారు. రజతోత్సవ సభకు పెద్దఎత్తున తరలిరావాలని ప్రజలు, పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

**రజతోత్సవ వేడుకలపై వినూత్న ప్రచారాలు**

వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించే రజతోత్సవ సభ విజయవంతం చేయడంపై బీఆర్‌ఎస్ నాయకత్వం సమావేశాలు నిర్వహించడంతో పాటు రజతోత్సవ సభపై జిల్లా అంతటా వినూత్న రీతిలో ప్రచారం నిర్వహిస్తున్నది. బీఆర్‌ఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అందోలు, జహీరాబాద్, నారాయణఖేడ్, పటాన్‌చెరు నియోజకవర్గాల నాయకులతో సమావేశమై రజతోత్సవ సభకు పార్టీ శ్రేణుల తరలింపుపై చర్చించారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తన సొంత నియోజకవర్గమైన సంగారెడ్డిలో మండలాలు, మున్సిపాలిటీల వారీగా పార్టీ నాయకులతో సమావేశాలు నిర్వహించారు. వరంగల్ సభకు జనం, బీఆర్‌ఎస్ శ్రేణుల తరలింపుపై దిశానిర్దేశం చేశారు. రజతోత్సవ సభపై నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. సంగారెడ్డి, సదాశివపేట పట్టణాల్లో నిర్వహించిన వాల్‌రైటింగ్, వాల్‌పోస్టర్ల ప్రచార కార్యక్రమాల్లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ స్వయంగా పాల్గొన్నారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పక్షం రోజులుగా రజతోత్సవ సభ విజయవంతం కోసం నియోజకవర్గంలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో రజతోత్సవ సభ విజయవంతం కోసం పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు. అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ రజతోత్సవ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సైతం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పర్యటిస్తూ వరంగల్ సభ విజయవంతంపై పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేస్తున్నారు. వరంగల్ సభపై పోస్టర్లు ఆవిష్కరించడంతో పాటు వాల్‌రైటింగ్ ఇతర ప్రచార కార్యక్రమాల్లోనూ స్వయంగా పాలుపంచుకున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు వరంగల్ సభకు తరలివచ్చేలా నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి నియోజవర్గం నుంచి 5 నుంచి 10వేల మంది జనం, పార్టీ శ్రేణులు వరంగల్ సభకు తరలివెళ్లేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్న ప్రజలు రజోత్సవ సభకు స్వచ్ఛందంగా వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఆరు గ్యారెంటీలు ఇచ్చి కాంగ్రెస్ మోసం చేయడంతో ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటూ వరంగల్ రజతోత్సవ సభలో పాల్గొనేందుకు రైతులు, యువకులు, విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రజలు, పార్టీ శ్రేణులు వరంగల్ వెళ్లేందుకు 30 నుంచి 40 వరకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో ప్రైవేటు వాహనాలు సిద్ధం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సొంత వాహనాల్లో వరంగల్ వెళ్లేందుకు రెడీ అవుతున్నారు.


## యువకుడి ఆత్మహత్య




భాస్కర్ (ఫైల్)

తొగుట, ఏప్రిల్ 24 : అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా తొగుట మండలం ఎల్లారెడ్డిపేటలో చోటు చేసుకుంది. తొగుట ఎస్సై రవికాంతారావు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మన్నె భాస్కర్ (29) డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. నాలుగేండ్ల క్రితం భాస్కర్ భార్య మృతి చెందింది. అప్పటి నుంచి మనోవేదనకు గురై బాధపడుతున్నాడు. దీనికి తోడు ఇంటిపై రూ.3.25 లక్షల లోన్ తీసుకున్నాడు. ఆ డబ్బులు కట్టలేక తీవ్ర మనస్తాపానికి గురై గురువారం తన ఇంటిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి మన్నె అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పిడుగుపాటుకు మహిళ మృతి



రంగవ్వ (ఫైల్)



లక్ష్మీపూర్‌లో నేలరాలిన మామిడికాయలు

బెజ్జంకి, ఏప్రిల్ 24: సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో గురువారం గాలిదుమారానికి చింతకాయ రాలిందని ఏరుకోబోయి పిడుగుపాటుకు గురై టేకు రంగవ్వ(59) మృతిచెందింది. మనువడు శ్రీధర్‌తో కలిసి చెట్టు వద్దకు వెళ్లిన కొద్ది సమయానికే పిడుగుపడగా రంగవ్వ, బాలుడు ఇద్దరు అపస్మారక స్థితికి వెళ్లారు. రంగవ్వను సిద్దిపేట దవాఖానకు తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలుడిని కరీంనగర్ తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. రంగవ్వకు భర్త శంకరయ్య, కుమార్తె, ఐదుగురు కుమారులు ఉన్నారు.

**అకాల వర్షంతో తీవ్ర నష్టం**

బెజ్జంకి మండలంలో కురిసిన వడగండ్ల వర్షం, గాలిదుమారానికి లక్ష్మీపూర్‌లో విద్యుత్ స్తంభాలు విరగడంతో పాటు మామిడికాయలు నేలరాలయి. మామిడి, ఇతర పంటలు నష్టపోయిన రైతులకు, పిడుగుపాటుతో మృతి చెందిన రంగవ్వ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి కోరారు.

**గోడ కూలి గర్భిణి మృతి**

మునిపల్లి, ఏప్రిల్ 24: సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని బుధేరా చౌరస్తాలోని తాజ్ రెస్టారెంట్‌లో గురువారం సాయంత్రం గోడకూలి గర్భిణి మృతిచెందింది. పోల్కంపల్లికి చెందిన గర్భిణీ మన్నె శ్రావణి(22) సదాశివపేటలోని ఓ దవాఖానలో పరీక్షలు చేయించుకుని తిరిగి ఇంటికి బయలుదేరింది. గాలిదుమారంతో కూడిన వర్షం రావడంతో తాజ్ రెస్టారెంట్ దగ్గర నిలబడగా గోడ కూలి ఆమెపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. సదాశివపేట దవాఖానకు తరలిస్తుండగా మృతిచెందింది.

**రాయికోడ్‌లో భారీగా ఈదురుగాలులు**

రాయికోడ్, ఏప్రిల్ 24: మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన వర్షం, ఈదురుగాలులకు చెట్లు, కరెంటు స్తంభాలు విరిగిపోయాయి. రైతులు సాగు చేసిన జొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది.